కథా నిలయం



# పనిచేసే పరమేశం

-భమిడిపాటి రామగోపాలం

పరమేశం అని నాకో ఫ్రెండున్నాడు. వాళ్ళది అసలు బొబ్బిలి దగ్గర రాముడువలస. అప్పుడెప్పుడో మేం విజయనగరం కాలేజీలో కలిసి చదువుకున్నాం. బి.ఏ. మొదటేడాది తరవాత వచ్చిన సెలవుల్లో వాళ్ళక్క గారింటికి వెళ్ళేడు.

బెంగుళూరు.

కన్నడ భాషలో అక్షరాలు తెలుగక్షరాల్లాగే ఉంటాయని తెలిసింది.

మాటల అర్థాలు తెలుగు మాటల అర్థాల్లా వుండవు.

ఉచ్ఛారణ కూడా చాలా వేరు.

అయినా సరే; కన్నడ భాష నేర్చుకోవాలని పట్టు పట్టేడు.

ఆ రోజుల్లో "ముప్పయి రోజుల్లో కన్నడభాష" లాంటి పుస్తకాల్లేవు.

అక్క ఇంట్లో ఉంటూ, ఆవిడ ఇరుగు పొరుగులూ, పనివాళ్ళు, కూరగాయల వాళ్ళు - ఇలాంటి జనం మాట్లాడేది శ్రద్ధగా విని-

అక్షరాలా-

ముప్పయి రోజుల్లో కాదుగాని-

నలభై అయిదురోజుల్లో కన్నడ భాష పట్టేడు.

బి.ఏ. ఫైనలియర్ చదివేటప్పుడు హాస్టల్ రూం వదిలేశాడు.

విజయనగరంలో కన్నడిగులు నడిపే ఒక శాకాహార పలహారశాల ఉండేది.

ఇప్పుడూ ఉందేమో.

వాళ్ళకి ఇంకో ఏరియాలో లాడ్జింగ్ కమ్ బోర్డింగ్ హౌసు ఉండేది.

ఇప్పుడూ ఉందేమో.

వాళ్ళకి ఇంకో ఏరియాలో లాడ్జింగ్ కమ్ బోర్డింగ్ హౌసు ఉండేది.

అది కూడా ఇప్పుడు ఉండే ఉంటుంది.

ఆ లాడ్జిలో ఒక రూం తీసుకున్నాడు. ఆ హోటల్లో భోజనం రెండింటికీ కలిపి నెలకి ఇంత - అని మాట్లాడుకున్నాడు. అక్కడ వర్కర్స్‌తో, మేనేజర్‌తో, రోజూ, వీలయినప్పుడల్లా; కన్నడంలో మాట్లాడటానికి ప్రయత్నించేవాడు.

అలా అలా రాయడం చదవడం కూడా నేర్చేడు.

బి.ఏ. ఫైనల్ పరీక్షలయ్యేక మళ్ళీ బెంగుళూరు వెళ్ళేడు.

అంతే. మరి రాలేదిటువేపు. ఒక ఉద్యోగ ప్రకటన చూసేడు. ఫ్రాన్సు దేశం వారు స్థాపించిన ఫలానా సంస్థలో అసిస్టెంట్ మేనేజర్‌గా పనిచెయ్యడానికి ఇంగ్లీషు బాగా తెలిసి కన్నడ భాషలో వర్కింగ్ నాలెడ్జ్ ఉన్న గ్రాడ్యుయేట్ కావాలి - అని; ఆ ప్రకటన.

ఆ కంపెనీ ఎత్తేశాక మరో దాంట్లోనూ, ఆ తరువాత ఇంకో కంపెనీలోనూ - అలా ఐదారు ఉద్యోగాలు చేసి ఎలాగో బెంగుళూర్లోనే ఉండిపోయేడు. ఓ చిన్నపాటి ఇల్లు కట్టుకున్నాడు.

పెద్దకొడుక్కి ఢిల్లీలో పని.

అమ్మాయి అత్తవారు విశాఖపట్నం.

రెండో కొడుకు అమెరికాలో ఉన్నాడు.

ప్రయివేటు కంపెనీల్లోనే అయినా 1953 నాటికే అసిస్టెంట్ మేనేజరు హోదా సంపాదించేడు కనక అరవై ఐదేళ్ళ వయసు వరకూ రిటైరవలేదు. అప్పటి జీతం కూడా ఏడువేలు దాటే ఉంది.

పెన్షన్ లేదు.

సంపాదించుకున్న డబ్బుతో పిల్లల చదువులూ, పెళ్ళిళ్ళూ అయ్యేయి.

హాయే.

నీకేం పరవాలేదు నాన్నా; మీకు డబ్బు పంపాలంటే అన్నయ్యకి ఇబ్బందేమో గాని నేను మీకు నెలకి రెండు వందల డాలర్లు పంపిస్తాను. రెండు వందల డాలర్లంటే రూపాయల్లో ఎనిమిది వేలకి పైమాటే కదా. మీరూ అమ్మా కృష్ణారామా అంటూ గడిపెయ్యొచ్చు - అన్నాడు రెండో అబ్బాయి.

ఆ పంపేదేదో నాకే పంపించు; అమ్మనీ నాన్ననీ నేనే చూసుకుంటాను - అని పెద్దవాడు పరమేశాన్నీ, పార్వతమ్మనీ ఢిల్లీ తీసికెళ్ళిపోయేడు.

ఆ శీతాకాలంలో ఢిల్లీ చలికి నుమోనియా తగిలి పార్వతమ్మ పోయింది.

అక్కణ్ణించే పరమేశానికి కష్టాలు ప్రారంభమయ్యేయి.

పార్వతమ్మ ఉంటే ఆ ఇంట్లో అందరికీ సుఖంగా ఉండేది.

కొడుక్కీ కోడలికీ కేరేజీలు కట్టివ్వడమే కాక మనవడూ, మనవరాలూ ఏ వేళప్పుడు ఏం తింటామన్నా చేసి పెట్టేది. పరమేశానికి కూడా నలభై ఏళ్ళ కిందటి నుంచీ ఏం సేవలు ఎంత శ్రద్ధగా చేస్తూ వచ్చిందో అన్నీ క్రమం తప్పకుండా చేసేది. ఆవిడకి రిటైర్మెంటూ, రెస్టూ లేవు.

ఢిల్లీ చేరుకున్న పదిహేనురోజుల్లో పరమేశం బిజినెస్ కన్సల్టెన్సీ అని ఒకటి పెట్టేడు. తోపుడు బండిమీద పకోడీల దుకాణం నుంచి ఫైబర్ గ్లాస్ ప్రొడక్షన్ వరకు - ముడిసరుకు ఎక్కడ దొరుకుతుంది, మంచి అమ్మకాలకి ఏ ప్రాంతం రైటు వరకు - సలహాలు చెప్పడం నుంచి బేంకు ఋణం కోసమో లైసెన్సు కోసమో అవసరమయ్యే ప్రాజెక్టు రిపోర్టు తయారు చెయ్యడం వరకు - ఎంతో పని, ఎంతో శ్రద్ధ, కొంచెం ఆదాయం.

కాని, పార్వతమ్మ పోగానే అతని దినచర్యలు, చర్యలు, ప్రతిచర్యలు - కొన్ని మారిపోయేయి, కొన్ని ఆరిపోయేయి.

పరమేశం పనిచేస్తాడేగాని - భార్యాభర్తలిద్దరూ ఉద్యోగాలకీ, మనవడూ, మనవరాలూ చదువులకీ ఉరుకులు పరుగుల మీద పోయే కుటుంబానికి అనుగుణం అనుకూలం అవసరం అయ్యే రకం పన్ను ఏవీ చెయ్యలేడు. అతను ఆ కుటుంబానికి భారం, తంటసం అయ్యేడు.

చిన్నకొడుకు ముందు ఓ దెబ్బ వేసేడు.

పార్వతమ్మ పోయినప్పుడు ఆ కొడుకూ - కోడలూ ఎగిరొచ్చేరే గాని, వాళ్ళు ఎగిరి వెళ్ళిన మరుసటి నెల నుంచే వాళ్ళు నెలకోసారి పంపుతూ ఉండే రెండు వందల డాలర్లూ ఇగిరిపోయాయి.

"ఇండియా-టు- అండ్- ఫ్రో- ఫేర్స్‌కీ మీ కందరికీ తెచ్చిన ప్రెజంటేషన్లకీ వదిహేను వేల డాలర్లయిపోయాయి. మేం కోలుకొనేదాకా మీకు డాలర్లు పంపలేం" అని మొదటి సందేశం.

"అమ్మ ఎలాగా పోయింది కదా. ఒక్క మనిషి మీరు. ఆ మాత్రం తిండి అన్నయ్య పెట్టలేకపోతాడా? మాకు లాగే వాళ్ళిద్దరికీ ఉద్యోగాలున్నాయి కదా!" అని తరువాతి మాట.

ఆ దేశం కొడుకు సందేశంతో సరిపెట్టుకున్నాడు గాని

ఈ దేశం కొడుకు ఆదేశమే ఇచ్చేసేడు.

"పనీ పాటూ లేకపోతే సరి. అడ్డమైన వాళ్ళతోటీ కబుర్లకోసం ఆ కన్సల్టెన్సీ ఎందుకు? వాళ్ళకి అతిథి మర్యాదలు చెయ్యలేక మేం ఛస్తున్నాం. పైగా దీనివల్ల ఫోను బిల్లు మూడు రెట్లు పెరిగింది. ఇవన్నీ మానేసి కృష్ణారామా అంటూ ఓ దగ్గిర కూచోండి నాన్నా."

ఓ "దగ్గిర కూచోండి" అనే అన్నాడు. ఓ "మూల కూచోండి" - అన్లేదు.

కాని కన్సల్టెన్సీ బోర్డు పీకేసి, ముందు వరండాలో ఉన్న టేబిలూ, కుర్చీలూ టీపాయీ వెనుకనే వున్న లంబర్ రూంలోకి మార్చేశాడు. అది ఆ ఇంటికి శుభంకరమైన ఈశాన్యం మూల. కానీ మూల మూలే కదా. అంచేత పరమేశాన్ని ఆ కొడుకు మూలనే కూర్చోబెట్టేసేడు.

కూర్చోబెట్టడమే కాదు. పడుకోడానికి ఒక మంచం వేసేడక్కడ.

ఆ తరువాత పరమేశం గ్రహించిందేమిటంటే.

తను టీవీ చూడాలంటే రెండు గదులు దాటి రావాలి.

ఫోన్‌లో మాట్లాడాలంటే మూడు ద్వారాలు దాటి రావాలి.

వాహ్యాళికి వెళ్ళాలంటే ఇటువేపు తాళం బిగించుకొని భవనం అంతా చుట్టబెట్టి రావాలి ఇవతలికి.

ఎముకలు కుళ్ళిన, వయస్సుమళ్ళిన సోమరులారా, చావండి - అన్నారు శ్రీశ్రీ

పరమేశానికి ఎముకలు కుళ్ళేయోలేదో తెలీదు.

వయస్సు మళ్ళినమాట నిజమే.

కాని, సోమరులారా - అన్నాడే; అక్కడొచ్చింది చిక్కు.

అతను సోమరి కాదు.

పనిచేసే పరమేశం.

- - -

కార్తికేయన్ అని, నేను 1953లో ఉద్యోగంలో చేరినప్పుడు మాకు "తవ్విపాతేసేటంత" అధికారం ఉన్న ఆఫీసర్. నా విషయంలో ఆయన, తవ్వడం వరకూ చేసేడుగాని పాతేడానికి వీల్లేకపోయింది. నాకు ఇంగ్లీష్ సాహిత్యం మీద ఉన్న పట్టూ కర్నాటక సంగీతం మీద ఉన్న అభిరుచీ తవ్వేడు. అతను నాకన్నా పధ్నాలుగేళ్ళు పెద్ద. ఈ ఏడాది జనవర్లో ఆయన సహస్రచంద్ర దర్శనం చేసుకున్న పండగ చేసేరు; ఆయన పిల్లలూ మనవలూ, తమ్ముళ్ళూ, చెల్లెళ్ళూ బంధువులూ.

ఆ కార్డుతో నాకూ మా ఆవిడకీ విశాఖపట్నం-బెంగుళూరు-విశాఖపట్నం; రానూ పోనూ టిక్కెట్లూ, ఒక హోటలు గది రిజర్వేషన్ కాగితం, ఒక చిన్న ఉత్తరం "తప్పకుండా రండి. మీరు నాకన్నా ఒక్క విషయంలోనే చిన్న... మరో సర్‌ప్రయిజ్... మీ పరమేశం గారు ప్రస్తుతం మా అన్నదాత!"

అంతా బాగానే ఉంది. పెద్దకొడుకు చేసిన మర్యాద దెబ్బకి తట్టా బుట్టా సర్దుకుని పరమేశం బెంగుళూరుకి తిరోగమించి ఉండొచ్చు; కాని, కార్తికేయన్ గారికి అన్నదాతగా ఎలా ఎదిగేడు?... ఎదిగే ఉంటాడు... చిన్న కొడుకు అమెరికాలో ఉన్నాడు కదా.

"ఉంటే మటుకు? ఆ కొడుకు ఎంత డబ్బు పంపిస్తే మటుకు, రిటైర్డ్ ఐ.సి.ఎస్. ఆఫీసర్‌కి అన్నం పెట్టే తాహతొన్తుందా?... నా అనుమానం - మీ పరమేశంగార్ని కొడుకులు సరీగా చూసుకోకపోడం వల్ల వీళ్ళింట్లో వంట మనిషిగా చేరేడేమో... అని. వంట వాళ్ళని మర్యాదకి అన్నదాత అనడం ఉంది కదా!" అంది నా భార్య.

రామహరి. అమంగళము ప్రతిహతమగుగాక!

- - -

సహస్ర చంద్ర దర్శన ఉత్సవం సందర్భంగా కార్తికేయన్ గారింట జరిగిన విందు చాలా పసందుగా ఉంది.

రైలు బెంగుళూరు చేరేసరికి ఉదయం తొమ్మిదిన్నర. "కార్తికేయన్ గారి వైజాగ్ అతిథుల కోసం" అని పెద్ద పెద్ద అక్షరాలు రాసున్న అట్టని ఒక వెదురు బద్దకి మేకులేసి కొట్టి; దాన్ని పట్టుకున్న "మహాదేవయ్య" మమ్మల్ని అర్జంటర్జంటుగా లాడ్జికీ, కార్తికేయన్ గారింటికీ కారులో తీసికెళ్ళేడు. 'పెళ్ళిపీట' అనే పసుప్పచ్చటి పొడుగాటి పీట మీద కార్తికేయన్‌గారూ దేవసేనగారూ పీతాంబరధారులై

# ఏడు(7) అంటే భయమేల?

'ఏడు' అనే మాటలో ఏదో అపశకునము, అశుభము, ప్రమాదము వున్నాయనే అనుమానం చాలామందికి వంటబట్టింది.

అయితే ప్రపంచంలో, మన సంస్కృతిలో ఈ అంకెకున్న విశిష్టతలు ఎన్నో వున్నాయి.

1) భూగ్రహంపై ఖండాలు 7.
2) పురాణాల్లో ఋషుల సంఖ్య 7. (సప్త ఋషులు) (వారు చనిపోయి సప్తర్షి మండలం అయినట్టుగా పేర్లు పెట్టారు)
3) వారానికి రోజులు 7.
4) ప్రపంచంలో అద్భుతాలు(వింతలు) 7.
5) ఇంద్రధనుస్సులో రంగులు 7. (VIBGYOR)
6) భారతీయ సంగీతంలో స్వరాలు 7. (సప్త స్వరాలు)
7) గ్రీకులకు, రోమన్లకు మహర్షులు ఏడుగురు.
8) గ్రీకు దేవుడు అట్లాస్‌కు కుమార్తెలు ఏడుగురు.
9) సూర్య భగవానుని రథానికి గుర్రాలు 7.
10) పాశ్చాత్య సంగీతంలోనూ స్వరాలు 7 (డొ, రె, మి, ఫ, సొ, ల, టి)
11) ప్రతి తెలుగు వాడి తొలి కథ 'అనగనగనగా ఒక రాజు. ఆ రాజుకి కొడుకులు ఏడుగురు...'

ఇంత సప్త పురాణం వుండగా, ఏడు అంకె పైన అనవసరమైన అనుమానాలు ఎందుకు...?

**- చప్పు నాగేశ్వరరావు**

పండు జుట్లతో నిండు నవ్వులతో మంత్రాలు వింటూ మనుషుల్ని కళ్ళతో పలకరిస్తూ ముచ్చటగా ఉన్నారు. కార్తికేయన్ గారి ఇల్లాలు దేవసేనగారు తప్ప; 'మూడో మనిషి' ఎవరూ నాకు తెలియదు. మా ఆవిడకైతే ఆ ఇద్దరు కూడా తెలీదు. మా కిద్దరికీ తెలిసిన ఆ మూడో మనిషి పరమేశం. "అన్నదాత కదా. వంటింట్లో ఉన్నాడేమో" అన్న తక్కువ మాటని ఎలా తిప్పికొట్టాలా అని రెండు క్షణాలు ఆలోచిస్తూ ఉండగానే వీపుమీద పరమేశం అలవాటుగా చేసే పలకరింపు. మెడనించి నడుం చివరి దాకా వెన్నెముక మీదుగా ఒక వేలితో తడమడం అది.

పరమేశం చెప్పిన కథ అతను చేయించిన విందులాగే చిత్రంగా ఉంది.

కొత్తతరం సంస్కృతిలో; ఎగువ మధ్య తరగతిలో – అంటే అప్పర్ మిడిల్ క్లాస్‌లో ప్రతి నాలుగిళ్ళకీ ఒకరుగా ఇద్దరుగా, శారీరకంగా నిస్సహాయులైన వృద్ధులు ఉంటున్నారు. అదేదో సినిమా పాటలో చెప్పినట్టు – రెక్కలు వచ్చి పిల్లలు ఎగిరేరు; రెక్కలు అలిసి మనం ఉన్నాము అని వ్యథ చెందుతున్న వాళ్ళు ఊరూరా, వాడవాడలా, వీథివీథినీ. పిల్లలు పెరగడం మన దగ్గరే గాని, ఎదగడం వేరే ఊళ్ళలోనూ, ఆ మాటకొస్తే వేరే దేశాల్లోనూ.

నాన్నా, మేం కులాసాగా ఉన్నాం. మీరూ అమ్మా కులాసా అనుకుంటాం. ఈ ఉత్తరంతో రెండు వందల డాలర్లు పంపిస్తున్నాను. మాకు తెలుసు, వంట చేసుకోడానికి అమ్మకి శక్తి ఉండదు, బజారుకెళ్ళి సరుకులూ, దినుసులూ, కూరలూ ఎంచుకోడానికీ, తెచ్చుకోడానికీ మీకు ఓపికుండదు. నౌకరునీ వంట మనిషినీ పెట్టుకుని వాళ్ళని మంచి చేసుకుని కులాసాగా కాలం గడపండి.

–అనే రకం ఉత్తరాలొస్తాయి.

వంట వాళ్ళతోనూ, నౌకర్లతోనూ కొన్ని చిక్కులుంటాయి. వేళకి రాకపోవచ్చు. నెలకో కొన్నిరోజులు నాగాలు పెట్టొచ్చు. సరుకులు దుబారా చెయ్యొచ్చు. సరుకులు తేవడంలో కక్కుర్తి కొట్టొచ్చు. ఇద్దరు వయోవృద్ధ దంపతులు తినేదానికన్నా వయసులో ఉన్న ఒక వంటమనిషి ఎక్కువ తినేయొచ్చు. మిగిలిపోయిందమ్మా అంటూ ఇంటికి పట్టుకుపోవచ్చు. నౌకర్లకి – మనం ఎంత గుట్టుగా ఉన్నాసరే, డబ్బు ఎక్కడ పెడతాం, విలువైన వస్తువులెక్కడ దాస్తాం – తెలుస్తుంది. దొంగతనాలు జరగొచ్చు – హత్యలే జరగొచ్చు.

కొడుకులో కూతుళ్ళో; దేశంలోనే – ఆ మాటకొస్తే ఉన్న వూళ్ళోనే – ఉండొచ్చు. కాని, ఈ ముసిలాళ్ళు వాళ్ళ దగ్గర ఉండలేరు. వాళ్ళు కూడా, వీళ్ళని దగ్గిరుంచుకోడానికి తగిన హృదయాలున్నా ఇళ్ళు అంత విశాలంగా ఉండక, వేరే ఉంచేస్తారు. "మీ కోసం కూడా స్నేహితులూ పాతతరాల బంధువులూ వస్తారు. వాళ్ళకి సేవలు చెయ్యలేం" అన్న ధోరణి వస్తుంది.

ఓల్డ్ ఏజ్ హోంలు ఉంటాయిగాని, వాటిల్లో కూడా ప్రభుత్వాలు నడుపుతున్న సంక్షేమ వసతి గృహాల పద్ధతులు ప్రవేశించి, సుఖం కన్నా పద్ధతే ముఖ్యం అన్న రీతిలో నడుస్తాయి. జవసత్వాలు సడలిన వాళ్ళు నిబంధనల సడలింపును కోరుకుంటారు.

ఇలా పరిశీలన, పరిశోధన చేసి, పరమేశం ఒక సంస్థ పెట్టేడు.

"పరమేశం అసోసియేట్స్"

మొత్తం ముగ్గురు.

పరమేశం, కార్తికేయన్‌గారు, బంగారప్ప అనే మాజీ ఎమ్మెల్యే.

బెంగుళూరు నగరాన్ని మూడు భాగాలుగా విడగొట్టుకున్నారు. మూడు భాగాల్లోనూ కలిపి మొత్తం నాలుగు వందల యాభై ఆరు మంది నిస్సహాయ వృద్ధులు దొరికేరు. మూడు ఆటో కేరియర్లు కొన్నారు. ముగ్గురు పర్మనెంట్ డ్రయివర్లు, ఒక స్పేరు డ్రయివర్. ఎనిమిది మంది వంటవాళ్ళు. పదిమంది పనివాళ్ళు. ముగ్గురు మేనేజర్లు. ప్రతి వృద్ధుల ఇంటికి – పగలు పన్నెండు గంటలకి కొంచెం అటూ ఇటూగాను, రాత్రి ఏడున్నరకి కొంచెం అటూ ఇటూగాను ఎవరి కేరేజీలో వారికి; ఎవరి కెంత ఆకలో అంత – శాకాహారం, పోషకాహారం – ఇస్తారు. పూటకి, మనిషికి పదిహేడు రూపాయలు. అందరి జీతాలు, ఖర్చులు, అద్దెలు పోను ఒక్కొక్క కేరేజ్ నుంచి అర్ధరూపాయి మిగులుతుంది. అది అనుకోకుండా తగిలే ఖర్చులకి పనికొస్తుంది.

"నువ్వు రచయితవి కదా. మాకో స్లోగన్ రాసి ఇయ్యి. కన్నడంలోకీ, ఇంగ్లీషులోకీ అనువాదం చేయించి కరపత్రాలు పంచిపెట్టి మరింత మందికి సేవచేస్తాం" అన్నాడు.

అతడుః పనిచేసే పరమేశం. అన్నదాత, అతనడిగిన కరపత్రమే – ఇది.

❀

